# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

గురువారం / 15.02.2024


# రేణుకా చౌదరి, అనిల్ యాదవ్ కు బీఫామ్

- కాసేపట్లో నామినేషన్ వేయనున్న రేణుక, అనిల్
- నామినేషన్ వేసిన బీఆర్ఎస్ అభ్యర్థి రవిచంద్ర
- ఏపీలో ఏకగ్రీవంగా ఎన్నిక కానున్న ముగ్గురు వైసీపీ అభ్యర్థులు



**తెలంగాణ వీణ , హైదరాబాద్ :** తెలంగాణ నుంచి రాజ్యసభ ఎన్నికల బరిలో ముగ్గురు అభ్యర్థులు నిలిచారు. కాంగ్రెస్ తరపున రేణుకా చౌదరి, అనిల్ కుమార్ యాదవ్... బీఆర్ఎస్ తరపున వద్దిరాజు రవిచంద్ర ఎన్నికల బరిలోకి దిగారు. వద్దరాజు రవిచంద్ర తన నామినేషన్ దాఖలు చేశారు. రేణుకా చౌదరి, అనిల్ కుమార్ యాదవ్ లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఫామ్ లను అందజేశారు. కాసేపట్లో వీరు తమ నామినేషన్లను సమర్పించనున్నారు. మరోవైపు ఏపీలో మూడు రాజ్యసభ స్థానాలకు వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథ్ రెడ్డి, గొల్ల బాబూరావులు నామినేషన్ వేశారు. తగినంత బలం లేకపోవడంతో రాజ్యసభ ఎన్నికలకు దూరంగా ఉండాలని టీడీపీ నిర్ణయించింది. దీంతో ముగ్గురు వైసీపీ నేతలు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నిక కాబోతున్నారు.

# భక్తుల ఇళ్లకే మేడారం ప్రసాదం



**తెలంగాణవీణ,ములుగు :** ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళా, ప్రకృతిని పూజించే విగ్రహాలు లేని జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతర. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈనెల 21వ తేదీ నుండి 24వ తేదీ వరకు అత్యంత వైభవోపేతంగా జరగనుంది. ఈసారి మేడారం జాతర అత్యంత ఘనంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం సంకల్పించింది.మేడారం జాతరకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిన ప్రభుత్వం, మేడారం జాతరకు వెళ్లలేని భక్తుల కోసం ఇంటికి ప్రసాదాలు పంపించే లాగా టీఎస్ ఆర్టీసీతో కలిసి దేవాదాయ శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో దేవాదాయశాఖ తో tsrtc లాజిస్టిక్స్ విభాగం ఒప్పందం కుదుర్చుకుంది.మేడారం సమ్మక్క సారక్కల గద్దెల నుండి అమ్మవారి ప్రసాదంతో పాటు, పసుపు కుంకుమలను భక్తుల ఇళ్ల వద్దకు సంస్థ అందజేయనుంది. ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే మహా జా నిన్నటి నుండి ఆఫ్ లైన్లోనూ , ఆన్ లైన్లోనూ అమ్మవార్ల ప్రసాదాన్ని భక్తులు బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని టీఎస్ఆర్టీసి లాజిస్టిక్స్ విభాగం కల్పించింది.ఇదిలా ఉంటే మేడారం జాతరకు సమయం ఆసన్నం అవుతున్న తరుణంలో మేడారం జాతర పనులపై ఇటీవల రివ్యూ మీటింగ్ నిర్వహించిన మంత్రి సీతక్క జాతరకు సమయం దగ్గర పడుతుందని, భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఇక మేడారం జాతర ఎన్నో రోజులు లేదని, ఇకపై రివ్యూ మీటింగ్ లో ఉండవని ఇదే లాస్ట్ మీటింగ్ అని ఆమె స్పష్టం చేశారు.పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని మంత్రి సీతక్క తేల్చి చెప్పారు. జాతరకు పెండింగ్ ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉంటే మేడారం మహాజాతర ప్రత్యేక పూజలు మండ మెలిగే పండుగతో ప్రారంభమయ్యాయి. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలతో నిర్వహించే ఈ వేడుకతో మేడారం జాతర మొదలైనట్టే చెప్తున్నారు.

# వేరుశనగ రైతుల సమస్యను తక్షణమే పరిష్కరించాలి - ఎమ్మెల్సీ కవిత



**తెలంగాణవీణ,హైదరాబాద్ :** వేరుశనగ రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఆ పంటకు కనీస మద్దతు ధర కల్పించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. కౌన్సిల్ లో ఈ అంశాన్ని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యేకంగా ప్రస్తావించారు. సీఎం సొంత జిల్లా అయిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఉన్న జడ్చర్ల, అచ్చంపేట, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ వ్యవసాయ మార్కెట్లలో వేరశనగ రైతులు తీవ్ర ఆందోళన చేస్తున్నారని తెలిపారు.ఆ పంటకు క్వింటాలుకు రూ.6377 కనీస మద్ధతు ధర ఉండగా..వ్యాపారస్తులు సిండికేట్ అయ్యి రూ.5 వేలలోపు కొనుగోలు చేస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. రైతులను వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పంటలకు కనీస మద్ధతు ధర కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.వేరుశనగ పంటకే కాకుండా అన్ని పంటలకు కనీస మద్ధతు ధర కంటే తక్కువ ధర ఉంటే రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిందని, కాబట్టి కనీస మద్ధతు ధర కల్పిస్తారా లేదా బోనస్ ఇస్తారా అన్న విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, వేరుశనగ రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

# ఢిల్లీ హైకోర్టుకు బాంబు బెదిరింపు




**తెలంగాణవీణ, జాతీయం :** ఢిల్లీ హైకోర్టుకు బాంబుల బెదింపులు రావడం తీవ్ర కలకలం రేపుతుంది. గుర్తుతెలియని వ్యక్తులు ఢిల్లీ హైకోర్టుకు బాంబు బెదిరింపులను ఈ- మెయిల్ ద్వారా పంపారు. దీంతో అలర్ట్ అయిన పోలీసులు న్యాయస్థానం దగ్గర కట్టుదిట్టమైన భద్రతాను ఏర్పాటు చేశారు.ఇక, ఢిల్లీ హైకోర్టులో భారీ బాంబు పేలుడు సంభవిస్తుందని కోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఈ మెయిల్ ఈ మెస్సేజ్ వచ్చింది. నేడు హైకోర్టులో బాంబు పేల్చుతానంటూ వచ్చిన ఈ-మెయిల్ పేలుడు ఢిల్లీలోనే అతిపెద్దది కానుంది అని అందులో పేర్కొన్నారు. అయితే, ఎంత మంది భద్రతా బలగాలైనా పెట్టుకోండి.. అందరినీ పేల్చివేస్తాం అంటూ గుర్తు తెలియని దుండగులు ఈ మెయిల్ లో బెదిరింపులకు దిగారు.ఇక, ఇదే రోజు మరోవైపు బీహార్ డీజీపీకి సైతం వాట్సాప్ లో ఆడియో క్లిప్ ద్వారా బాంబు బెదిరింపు పంపడం గమనార్హం. అయితే, ఈ ఘటనలో నిందితుడిని కర్ణాటకలో పటుకున్నామని పోలీసులు వెల్లడించారు. అక్కడి నుంచి అతణ్ని ఎంక్వైరీ కోసం పట్నాకు తరలించారు. నిందితుడిని అన్ని కోణాల్లో లోతుగా విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# జేడీ లక్ష్మినారాయణ పార్టీలో చేరిన శిరీష..



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో బర్రెలక్క అలియాస్ శిరీష ఎంత పాపులర్ అయ్యిందో అందరికీ తెలిసిందే. కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసింది బర్రెలక్క. గెలుపోటములను పక్కనబెడితే ఆమె చూపించిన తెగువను నేటి యువత అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని చాలా మంది మేధావులు సూచించారు. ఇక జేడీ లక్ష్మినారాయణ వంటి ప్రముఖులు ఆమెకు మద్దతుగా నిలిచారు. అయితే ఇప్పుడు బర్రెలక్క ప్రస్తావన ఎందుకంటే.. ఏపీ రాజకీయాల్లోనూ బర్రెలక్క ఎంట్రీ ఇచ్చింది.తెలంగాణ బర్రెలక్క శిరీష తరహాలోనే కృష్ణాజిల్లా పామర్రులోనూ ఓ శిరీష ఏపీ ఎన్నికల బరిలో దిగుతున్నారు. పామర్రు నియోజకవర్గం మొవ్వకు చెందిన శిరీషా రాణి అనే డిగ్రీ చదివిన యువతి.. బుధవారం జై భారత్ నేషనల్ పార్టీలో చేరారు. వందమంది మహిళలతో కలిసి శిరీష విజయవాడలో జై భారత్ నేషనల్ పార్టీ అధినేత లక్ష్మినారాయణ సమక్షంలో పార్టీలో చేరారు. అనంతరం జై భారత్ నేషనల్ పార్టీ పామర్రు ఇంఛార్జిగా శిరీషను నియమించిన లక్ష్మినారాయణ.. తెలంగాణలో బర్రెలక్క తరహాలో పామర్రులో ఈ బర్రెలక్క అలియాస్ శిరీషా రాణి రాజకీయ అరంగేట్రం చేస్తున్నారని చెప్పారు. జై భారత్ నేషనల్ పార్టీ అజెండాతో శిరీష ముందుకెళ్తారన్న లక్ష్మినారాయణ.. మహిళల కోసం తమ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అంశాలతో ఆమె ప్రచారం చేస్తారన్నారు.తెలంగాణ ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన బర్రెలక్క.. బెదిరింపులను సైతం లెక్కచేయక ఎన్నికల్లో పోటీచేసింది. సోషల్ మీడియా వేదికగా ఆమెకు బలమైన మద్దతు లభించింది. వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖులు, నెటిజన్లు శిరీషకు సపోర్ట్ చేశారు. లక్ష్మినారాయణ సైతం కొల్లాపూర్ వెళ్లి శిరీష తరుఫున ప్రచారం చేశారు.

# తిరుమలలో రేపు రథసప్తమి వేడుకలు




**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** తిరుమలలో రేపు రథసప్తమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈ సందర్భంగా ఒకేరోజు ఏడు వాహనాలపై స్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.. పవిత్రమైన మాఘ మాసంలో శుక్ల పక్ష సప్తమి తిథిని రథ సప్తమి లేదా మాఘ సప్తమి అని పిలుస్తారు. ఈ పరమ పవిత్రమైన రోజున శ్రీ సూర్యదేవుడు జన్మించాడని, ప్రపంచం మొత్తానికి జ్ఞానం ప్రసాదించాడని వేదాల ద్వారా తెలుస్తోంది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని తిరుమలలో రథసప్తమి వేడుకలు నిర్వహిస్తారు.. దీనినే ఒక్క రోజు బ్రహ్మోత్సవాలు అని కూడా పిలుస్తారు.. ఇక, ఈ సమయంలో భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అంచనాలు ఉండగా.. భక్తుల కోసం టీటీడీ విస్తృతమైన ఏర్పాట్లు చేస్తోంది. రథసప్తమి వేడుకల సందర్భంగా శుక్రవారం రోజు ఉదయం 5:30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు శ్రీవారికి వివిధ వాహన సేవలు నిర్వహించనున్నారు.. మొత్తం 7 వాహనాలపై భక్తులుకు దర్శనం ఇవ్వనున్నారు మలయప్పస్వామి.. తెల్లవారుజామున 5.30 నుంచి 8 గంటల వరకు సూర్యప్రభ వాహనం, ఉదయం 9 నుంచి 10 గంటల వరకు చిన్నశేష వాహనం, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గరుడ వాహన సేవ, మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు హనుమంత వాహన సేవ, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు చక్రస్నానం, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కల్పవృక్ష వాహన సేవ, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు సర్వభూపాల వాహన సేవ, రాత్రి 8 నుంచి 9 గంటల వరకు చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు శ్రీవారు..

ఇక, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని.. ఇవాళ, రేపు, ఎల్లుండి తిరుపతిలో జారీ చేసే సర్వదర్శన టోకెన్లు రద్దు చేసింది టీటీడీ.. రేపు శ్రీవారి ఆలయంలో ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు కూడా రద్దు చేసినట్టు టీటీడీ ప్రకటించింది.. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్దకు చేరుకున్న భక్తులను సర్వదర్శనానికి అనుమతించనున్నారు టీటీడీ అధికారులు. మరోవైపు తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది.. 18 కంపార్టుమెంట్లలో భక్తులు వేచిఉన్నారు.. శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటల సమయం పడుతుందని అధికారులు వెల్లడించారు. నిన్న శ్రీవారిని 67,275 మంది భక్తులు దర్శించుకోగా.. 25,293 మంది తలనీలాలు సమర్పించారు.. హుండీ ఆదాయం రూ.3.07 కోట్లుగా ప్రకటించింది టీటీడీ.